క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారికి సోమవారం విశ్వవర్షిని ఎంప్లాయిస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపైనే విద్యార్థుల భవిత, దేశ భవిష్యత్ ఆధార పడిందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శంకరయ్య, భూమయ్య పాల్గొన్నారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలని వినతి

రాయికల్: మండలంలోని మంక్యానాయక్ తండాలో 58 సర్వేనంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొంత మంది కబ్జాకు గురిచేసి అక్రమ పట్టా పొందారని, వెంటనే పట్టాను రద్దు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్

పెగడపల్లి: పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు వారం రోజులుగా పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లలకు సమాజంపై బాధ్యత తెలిసేలా ఉపాధ్యాయులు మార్గ నిర్దేశనం చేస్తున్నారు. ఇందులో బాగంగా సోమవారం వ్యక్తిగత శుభ్రంపై అవగాహన కల్పించడం, తప్పనిసరి పరిస్థితుల్లో చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారుడు రోగ నివారణ టీకాలు వేయించాలి


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మనీషా

మెట్‌పల్లిరూరల్: నాలుగు నెలలు పైబడిన మేకలు,గొర్రెలకు పారుడు రోగ నివారణ టీకాలు(పీపీఆర్) తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య అన్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో సోమవారం మేకలు,గొర్రెలకు మండల పశువైద్యాధికారి మనీషా ఆధ్వర్యంలో పీపీఆర్ టీకాలు వేశారు. మూగజీవుల యాజమానులకు పలు సలహాలు,సూచనలు చేశారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమ,రమణయ్య,చిరంజీవి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్ హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోతని నవీన్, అధ్యాపకులు బట్టు హరికృష్ణ, సాజీద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడుగురి బైండోవర్

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లునట్లు ఎఫ్ఆర్‌వో ముషియొద్దీన్ సోమవారం తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి కొడిమ్యాల ఫారెస్ట్ పరిధిలో పలు రకాల నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను తహసీల్దార్ రాజమణి ముందు హాజరుపరిచి బైండోవర్ చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ముషీద్ పాల్గొన్నారు.

వరదకాలువకు 18వేల క్యూసెక్కుల నీటి విడుదల

మల్యాల: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు 18000 క్యూసెక్కుల నీరు విడుదల చేసిన నేపథ్యంలో వరదకాలువలోకి మత్స్యకారులు, పశువుల కాపర్లు కాలువలోకి దిగవద్దని డీఈఈ తిరుపతి తెలిపారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని కాలువ పరిసరాల్లోకి పశువులు వెళ్లకుండా చూసుకోవాలని, రైతులు సైతం మోటార్ల కోసం కాలువలోకి దిగకూడదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిలిచిన పశుబీమా..

- ఆర్థికంగా నష్ట పోతున్నామంటున్న రైతులు
- గత ప్రభుత్వంలో అమలు, గడువు ముగింపు
- బీమా అమలు చేయాలని వేడుకోలు


రాయితీపై అందించిన గొర్రెలు

పెగడపల్లి: వ్యవసాయం చేసి ఆర్థికంగా నష్టపోతున్న రైతులకు ఆసరాగా నిలిచేది పాడి పరిశ్రమనే. చాలా మంది తమకు వ్యవసాయ భూమి లేకున్నా పాడి పశువులను పెంచి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. జిల్లాలో రోజురోజుకు పాడిపశువులపై ఆధారపడే కుటుంబాల సంఖ్య పెరుగుతోంది. గతంలో పశువులకు బీమా పథకం అమలు ఉండేది. పశువులు ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే పాడి పశువుల బీమా పథకం ద్వారా ఆర్థికంగా నష్ట పరిహారం అందేది. ఈ పథకం రెండేళ్ల నుంచి అమలులో లేక పాడి రైతులు ఆర్థికంగా నష్ట పోవాల్సి వస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పే ప్రభుత్వాల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని పాడి రైతులు విమర్శిస్తున్నారు. పాడి పశువులు అనారోగ్యం, ఇతర కారణాలతో చనిపోతే బీమా సౌకర్యం లేక ఆర్థికంగా నష్టపోయి ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. బీమా ఉండి వివిధ కారణాల వల్ల చనిపోయిన పాడి పశువులు, గొర్రెలు, మేకలకు నష్ట పరిహారం అందేది. రెండేళ్లుగా పశుబీమా పథకం అమలులో లేక పోవడవంతో పశువులు చనిపోతే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

గొర్రెలకు అంతే..

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేపెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి మొదటిసారి బీమా సౌకర్యం కల్పించింది. కానీ గొర్రెలు పంపిణీ చేసిన ఏడాది తరువాత బీమా ముగిసింది. తరువాత నుంచి రెన్యూవల్ చేయక పోవడంతో గొర్రెలకు ప్రస్తుతం బీమా లేకుండా పోయింది. గొర్రెలతో పాటు. రైతుల వద్ద ఉన్న గేదెలకు, ఎద్దులు, ఆవులకు సైతం ప్రస్తుత ప్రభుత్వం గొర్రెల బీమా పథకాన్ని పునరుద్ధరించి 50 శాతం నిధులను కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి పరిశ్రమతో జీవనాధారం..

జిల్లాలో అనేక గ్రామాల్లో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ రైతులకు జీవనాధారంగా మారింది. పెద్ద ఎత్తున వ్యవసాయంతో పాటు పశువుల పెంపకంపై రైతులు ఆశక్తి చూపుతున్నారు. గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘాలు ఉండటంతో పాల డెయిరీలు ఏర్పాటు చేసుకుని పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గేదెలు 81,500, ఆవులు 30901, గొర్రెలు 6,10,985, మేకలు 97,035, కోళ్లు23,24,868, ఇతరత్ర 3,310 ఉన్నాయి.

పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి



పాడి ఆవులు, గేదెలతో పాటు ఎద్దులకు బీమా సౌకర్యం కల్పిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వ్యాధుల బారినపడి, ఇతర కారణాల వల్ల పశువులు మృతి చెందితే రైతులకు నష్ట పరిహారం అందే అవకాశం ఉంటుంది.
– బొమ్మెన స్వామి, రైతు పెగడపల్లి

గొర్రెల బీమా పథకం అమలు చేయాలి



గత ప్రభుత్వం రాయితీపై అందించిన గొర్రెలపై ఏడాది బీమా కల్పించింది. ఆ గడువు ముగిసిన తరువాత పథకం రెన్యూవల్ చేయలేదు. దీంతో గొర్రెలు చనిపోయి ఆర్థికంగా నష్ట పోతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల బీమా పథకం అమలు చేసి గొర్రెల కాపరులను ఆదుకోవాలి.
– బైర రాజయ్య పెగడపల్లి

ప్రభుత్వం బీమా నిలిపివేసింది



గతంలో ఉన్న బీమా పథకం ప్రస్తుతం అమలులో లేదు. గత ప్రభుత్వం పశు బీమా పథకం నిలిపి వేయడంతోనే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బీమా పథకం అమలు చేసే అంశం తమ పరిధిలో లేదు. ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరిస్తే పాడి రైతులకు మేలు జరుగుతుంది.
– వేణుగోపాల్‌రావు, జిల్లా పశు వైద్యాధికారి

ఘనంగా కాళోజీ జయంతి


కోరుట్లలో నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు


రాయికల్‌లో ఉపాధ్యాయులు,విద్యార్థుల నివాళి

జగిత్యాల: తెలుగు భాషకు నిలువెత్తు సంతకం కాళోజీ అని మహిళడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. సోమవారం మహిళా డిగ్రీ కళాశాలలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో కాళోజీకి నివాళి అర్పించారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/ ధర్మపురి/ కథలాపూర్: కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సి.ప్రభాకర్ గ్రంథాలయంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
కథలాపూర్ మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూల్, పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలో నివాళి అర్పించారు. రాయికల్ జిల్లా


జగిత్యాల: నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కాలోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ధర్మపురి మండలంలోని కమలాపూర్ మండల పరిషత్ పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, హెచ్ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **పంచాయతీ ఎన్నికలకు అధికారుల జాబితా తయారు**

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో బీఎల్వోలు వార్డుల వారిగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తుండగా, ఎన్నికల సంఘం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు తయారుచేసిన ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల జాబితాను ఇటీవల అన్ని శాఖలకు చెందిన అధికారులు బదిలీ కావడంతో వెంటనే జిల్లాల వారిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంతో జాబితా సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్ చివరి వరకు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల జాబితాను సిద్ధంచేసి ఎన్నికల సంఘానికి సమర్పించనున్నారు.

- **ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి**

సారంగాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను విడుదల చేస్తూ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా కార్యదర్శులు కూరగాయల చంద్రశేఖర్, రాచమల్ల మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి, డీఈడీతో పాటు, బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు కల్పించాలన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు గొడుగు రఘుపతి యాదవ్, మండల బాధ్యులు చీర్నేని రాజిరెడ్డి, కొత్త రాము, సిరికొండ వేణు, గుడిసె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గురు బ్రహ్మ' అవార్డు అందుకున్న వెంకయ్య

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకయ్య ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'గురుబ్రహ్మ' అవార్డును అందుకున్నారు. విద్యారంగంలో చేసిన కృషికి గాను ఆయనకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆయనకు ఈ అవార్డును అందజేసింది.

- **శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా ఉద్యమించాలి**

మల్యాల: శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా విద్యార్థులు ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ 50 వసంతాల సదస్సును నిర్వహించారు. భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత ఉందని,ఎందరో మహానుభావులు సమ సమాజ స్థాపన, విద్యార్థుల హక్కుల సాధనకు కృషి చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ శక్తులకు అప్పగించారని విమర్శించారు. పాలకుల విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు రాజు, మహేశ్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

- **అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్**

పెగడపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ మాసోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తులు, బరువులు తీయడం, న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేయడం, లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేశారు. పోషకాహారంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

- **జోగిన్‌పెల్లిలో సామాజిక సమరసత కుటుంబాల సమ్మేళనం**

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి రాజరాజేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి సామాజిక సమరసత కుటుంబాల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గణపతి నవరాత్రుల విశిష్టత, హిందూ జీవన విధానం, భారతీయ కుటుంబ వ్యవస్థ, ప్రాముఖ్యతలను వివరించారు. అనంతరం అప్పల రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోరుట్ల సమరసత అధ్యక్షుడు శనిగరపు రాజేశం, జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్,కనకారావు, రాజనర్సయ్య, బద్దం తిరుపతిరెడ్డి, మహిపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పొన్నం సత్తయ్యకు ఎమ్మెల్యే నివాళి

జగిత్యాల: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్యగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లో ఆయన సమాధికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నివాళి అర్పించారు. ఆయన వెంట పలువురు నాయకులున్నారు.

- **రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు**

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో యువకులు సోమవారం శ్రమదానంతో రోడ్డుపై ఉన్న గుంతలు మట్టితో పూడ్చారు. పోసానిపేట- తాండ్ర్యాల గ్రామాల మధ్య తారు రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనచోదకులు, ప్రజలు అవస్థల పాలవుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి, దీంతో పోసానిపేట యువకులు స్పందించి రోడ్డుపై గుంతలు ఉన్న చోట మట్టిని పోసి చదును చేశారు. ఈ సందర్భంగా యువకులను గ్రామస్తులు అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లి: పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 40 మందికి రేకుర్తి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించినట్లు అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో గుండా రాకేశ్, నాంపల్లి వేణుగోపాల్, వెల్ముల శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

- **ఎంపీడీవో బాధ్యతలు స్వీకరణ**

సారంగాపూర్: సారంగాపూర్ ఎంపీడీవోగా సోమవారం గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. సారంగాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న లచ్చాలు బీర్‌పూర్ పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా గంగాధర్ ధర్మపురి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

- **ఇసుక లారీ పట్టివేత**

మెట్‌పల్లి: నియోజకవర్గంలోని నాగులపేట, సిరికొండ వాగుల నుంచి అక్రమంగా ఇసుకను ఓ లారీలో ఆర్మూర్‌కు తరలిస్తుండగా, పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అలాగే సంబంధిత యాజమాని కారును సైతం సీజ్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌కు చెందిన ముదాం రమేశ్ తన టీఎస్ యూబీ 7717 అనే లారీలో అల్లావుద్దీన్ అనే డ్రైవర్‌తో ఆర్మూర్‌కు ఇసుకను తరలిస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న రెవెన్యూ అధికారులు డిపో వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

- **బ్యూటీపార్లర్ ప్రారంభం**

రాయికల్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఝాన్సీ బ్యూటీ పార్లర్‌ను సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలు కోరుట్ల, చింతకుంట

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో ఉమెన్స్ విభాగంలో కోరుట్ల ఉమెన్స్ టీం, మెన్స్ విభాగంలో చింతకుంట ఏ టీంలు విజయం సాధించాయి. కోరుట్ల ఉమెన్స్ టీంతో ఎస్ఆర్ఆర్ కరీంనగర్ ఉమెన్స్ టీంలు తల పడగా కోరుట్ల ఉమెన్స్ టీం విజయం సాధించింది. ఉమెన్స్ విభాగంలో చింతకుంట బీ టీంతో కరీంనగర్ ఏ టీం తలపడగా చింతకుంట బీ టీం విజయం సాధించాయి.ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు ఇన్విటేషన్ కీ.శే. శశిధర్ ఏఆర్ డీఎస్పీ స్మారక మెన్, ఉమెన్ విభాగంలో పోటీలు నిర్వహించారు. విజేతలను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు, సీఐ సురేష్ బాబు, ఎస్సైస శ్రీకాంత్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎంఏ భారి, గంగాధర్, లక్ష్మీనారాయణ.తదితరులు పాల్గొన్నారు.



రాయికల్: మండలంలోని రాజానగర్ ఎస్సీ,ఎస్టీ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా తెగిపోవడంతో కాలనీవాసులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన తెగిపోయిన రోడ్డును మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
వెంకటరమణ ఆర్‌అండ్‌బీ డీఈ,రాయికల్, నంబర్ : 9440818426

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

హైకోర్టు తీర్పును గౌరవిస్తాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ధర్మపురిలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి

ధర్మపురి: పార్టీ పిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ స్వాగతిస్తున్నామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం హైకోర్టు తీర్పుపై స్పందిస్తూ ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంపై బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పార్టీపై బురదజల్లే ప్రయత్రం చేస్తున్నారని, ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి తమ పార్టీలోకి ఆహ్వానించిన విషయాలు ప్రజలకు తెలుసునని, దయ్యాలు వేదాలు వల్లించిన విధంగా హరీశ్‌రావు వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. ఆయన వెంట వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులున్నారు.

గణపతికి ఎమ్మెల్సీ పూజలు


అర్పపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం పూజలు నిర్వహించారు. శివాజీ రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీమారంలో అన్నదానం

మేడిపల్లి: భీమారం మండలంలోని కమ్మరిపేటలో పటేల్స్ యూత్ – మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గణేశ్ మండపం వద్ద సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీమారం, మేడిపల్లి మండలాల అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, రమేశ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కాయిన్ వేస్తే గణపతి ప్రత్యక్షం


రాయికల్‌లో మన యూత్ ఆధ్వర్యంలో గణపతి

రాయికల్: పట్టణంలోని మన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడు అందరినీ ఆకట్టుకుంది. రూ.10 కాయిన్ వేసి గణపతి పాదాలను ముట్టితే నంది తన చుట్టూ తాను తిరుగుతూ శివుని ముందుకు వచ్చి ఆగిపోవడంతో శివలింగం నుంచి వినాయకుడు ప్రత్యక్షం కావడంతో పాటు, అదే సమయంలో దీపాలు వెలగడంతో అందరినీ ఆకట్టుకుంది. దీంతో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి గణనాథున్ని దర్శించుకుంటున్నారు.

నియామకం

జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాజోజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బడే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చౌడారపు రాంప్రసాద్, పాత శ్రీనివాస్, అడువాల రవి, పుప్పాల నాగన్న, బందరు కంటి శ్రీనివాస్, గుంటుక సురేష్, కోశాధికారిగా లకుమల్ల సత్తయ్య, కార్యదర్శులుగా దీకొండ రవి, గన్నారపు నరసింహమూర్తి, గుగ్గిళ్ల నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకులు గడిపెల్లి నర్సయ్య తెలిపారు.

- **బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా రాఘవరెడ్డి**

మెట్‌పల్లి: బీజేవైఎం కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్‌గా పన్నాల రాఘవరెడ్డిని నియమితులయ్యారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి నరేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, దొనికెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగరావు

మల్లాపూర్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (టీఎస్) ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగరావు(ఎంపీపీఎస్-రేగుంట)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగరావును మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేశరాజు రాజేశ్, మండల బాధ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

- **ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా ముజాఫర్**

రాయికల్: రాయికల్ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా ముజాఫర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్.శ్రీకర్, ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.